సాక్షి
పార్వతీపురం మన్యం

బుధవారం । 23 । అక్టోబర్ । 2024



మద్దతు ధరకు 'తేమ'తెగులు

ఖరీఫ్ సేద్యం దాదాపుగా చివరి దశకు చేరింది. దిగుబడి చేతికి వస్తున్న క్రమంలో రైతులు ఆరుగాలం సాగించిన కష్టాన్ని సొమ్ము చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు ధాన్యం కొనుగోలుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు.



వసతిగృహాల్లో సమస్యల తిష్ఠ

పార్వతీపురం జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు సమస్యలతో సతమవుతున్నారు. తాగడానికి, వినియోగానికి నీరు, ఉండడానికి సరిపడ గదులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో

ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ బాధ్యతల స్వీకరణ



సీతంపేట: ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ విభాగం ఈఈగా పి.రమాదేవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఈ పోస్టులో డీఈ సింహాచలం ఈఈగా ఎఫ్ఏసీ బాధ్యతలు నిర్వరిస్తున్నారు. ఆమె బాధ్యతలు చేపట్టడంతో ఎట్టకేలకు ఈఈ పోస్టు భర్తీ అయ్యింది. విజయవాడ ఈఎన్సీ కార్యాలయం నుంచి ఇక్కడికి ఆమె ఈఈగా బదిలీపై వచ్చారు.

న్యూస్‌రీల్

విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి

కొమరాడ: మండలంలోని కూనేరు గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి జె.అనిష్(4) అనే చిన్నారి మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో ఉన్న చర్చిలోనికి ఎలుకలు రాకుండా ఓ వ్యక్తి ఎర్త్ వైర్ పెట్టాడు. గ్రామానికి చెందిన బాలుడు ఆనిష్ ఆటలు ఆడుకుంటూ ఆ వైర్‌ను ముట్టుకున్నాడు. దీంతో షాక్ కొట్టి ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో స్థానికులు పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించినప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొమరాడ ఎస్సై నీలకంఠం తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి



ట్రైసైకిల్‌ను అందజేసిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అందజేస్తున్న పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు విభిన్న ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోగా వారికి అవసరమైన ట్రైసైకిళ్లను, వినికిడి పరికరాలను ఆయన మంగళవారం పంపిణీ చేశారు. ఈ మేరకు మక్కువ మండలంలోని శంబర గ్రామానికి చెందిన టి. నారాయణరావు, పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన బండి భాస్కరరావులకు ట్రైసైకిళ్లను అందజేశారు. అలాగే పార్వతీపురానికి చెందిన లండ తవిటి నాయుడికి వినికిడి యంత్రాన్ని అందజేశారు. అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన పరికరాలను అందించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకురాలు కె. కవిత తదితరులు పాల్గొన్నారు.

ఇదేం చోద్యం..!

ఊరంతటిది ఒకదారి..ఉలిపికట్టది మరోదారి అన్నట్లు తయారైంది జిల్లాలోని బడిదేవర కొండ వ్యవహారంలో పరిస్థితి. ఎక్కడైనా పర్యావరణానికి విఘాతం కలిగించే పరిశ్రమలు, తవ్వకాలు వద్దంటూ ఆందోళనలు జరగడం అందరికీ తెలిసిందే. అయితే బడిదేవర కొండ విషయంలో మాత్రం లీజు సంస్థకు మద్దతుగా కొంతమంది కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించడం విశేషం.



బడిదేవరకొండలో తవ్వకాలకు మద్దతుగా ధర్నా

- బడిదేవరకొండపై కొత్త డ్రామా
- లీజు సంస్థకు మద్దతుగా కలెక్టరేట్ వద్ద ధర్నా
- అవాక్కవుతున్న గిరిజనులు, సంఘాలు

సాక్షి, పార్వతీపురం మన్యం: పార్వతీపురం మండలంలో ఉన్న బడిదేవరకొండపై గ్రానైట్ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని ఇప్పటివరకు అనేక ప్రజా సంఘాలతో కలిసి గిరిజనులు పోరాటం చేస్తూ వస్తున్నారు. అయితే మంగళవారం కొంతమంది పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని లీజు సంస్థకు మద్దతుగా ధర్నా నిర్వహించారు. 'వద్దు వద్దు ఆటంకాలు వద్దు..ఎంఎస్‌పీ కంపెనీయే ముద్దు' అంటూ ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. ఆ కంపెనీ ఉంటేనే తమకు ఉపాధి దొరుకుతుందని కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేయడం గమనార్హం.

అంతా స్థానికేతరులేనా?

బడిదేవరకొండ మీద గ్రానైట్ తవ్వకాల విషయంలో పెద్ద ఎత్తున వివాదం నడుస్తోంది. గిరిజనులు ఉద్యమబాట పట్టారు. ఈ క్రమంలో తవ్వకాలకు మద్దతుగా ధర్నా చేయడం వెనుక లీజు సంస్థ ప్రమేయం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ధర్నాకు వచ్చిన వారిలో అధికశాతం మంది స్థానికేతరులేనని వారి మాటల్లోనే అర్థమవుతోంది. తాము శివిని, జగన్నాథపురం, కొంకరాడ తదితర ప్రాంతాలకు చెందినవారమని..స్వయంగా ధర్నాలో పాల్గొన్న వారే చెబుతున్నారు. ఎక్కువగా కొండ ప్రభావిత ప్రాంతాలవారు కానట్లు తెలుస్తోంది. క్వారీకి సమీపంలో ఉన్న కొంతమంది యువకులను కూడగట్టి..వారి నాయకత్వంలో ధర్నాకు సంబంధిత లీజు సంస్థ పంపినట్లు సమాచారం. ఇందుకుగాను ఒక్కొక్కరికీ రూ.400 వరకు ఇచ్చినట్లు ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇదంతా ప్రజాపోరాటాన్ని విచ్ఛిన్నం చేసి లబ్ధి పొందడానికి ఆడుతున్న డ్రామా అంటూ బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ నాయకులు కొట్టిపడేస్తున్నారు.

గ్రానైట్ కంపెనీ నిర్వాహకులపై చర్యలు తీసుకోండి

పార్వతీపురంటౌన్: బడిదేవరకొండ గ్రానైట్ కంపెనీ నిర్వాహక యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గిరిజన జేఏసీ, గిరిజన సంఘాల నాయకులు దుక్క సీతారాం, తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బండిదేవరకొండపై నిర్వహిస్తున్న గ్రానైట్ మైనింగ్‌ను వారంతా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా గిరిజన సంపదను, దేవతలను కొలిచే అడవి కొండలను, నీటి వనరులు, పర్యావరణం, పంటలకు గిరిజనుల జీవనానికి నష్టం కలిగించే బడిదేవర కొండపై అక్రమంగా క్వారీ పనులు వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒక సర్వే నంబర్‌లో అనుమతి పొంది ఉన్నారని అధికారులు చెబుతున్నారు కానీ..మరో సర్వే నంబర్‌లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని అనుమానంగా ఉందన్నారు. ఆ చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న ప్రజలు అనారోగ్యం బారిన పడడమే కాకుండా చుట్టుపక్కల పంట పొలాల రైతులకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ కొండ ప్రాంతంలో గిరిజనులకు పోడు పట్టాలు ఉన్నాయని, ఈ ప్రాంత ప్రజల ప్రజా అభిప్రాయం తీసుకోకుండా అక్రమంగా కొండ తవ్వకాలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. పలువురు రాజకీయ నాయకులు, అధికారుల కుమ్మక్కుతో ఈ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ పరిశీలనలో పల్ల సురేష్, మండల గిరిధర్, ఆరిక చంద్రశేఖర్, ఇంటికుప్పల రామకృష్ణ, మోసూరు త్రినాథ్, నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.



బడిదేవర కొండ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమసంఘం నాయకులు

విపత్తులు ఎదుర్కొనేందుకు సిద్ధం కండి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: తుఫాన్ కారణంగా సంభవించే విపత్తులను ఎదుర్కొనేందుకు జిల్లా, మండల అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి జిల్లా, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ నెల 23 నుంచి 25 వరకు జిల్లాలో ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించడంతో జిల్లాలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గర్భిణులు, వృద్ధులను వసతిగృహాలకు తరలించాలని, మత్స్యకారులు చేపలవేటకు వెళ్లకుండా చూడాలని చెప్పారు. జిల్లా, మండల అధికారులతో పాటు అంగన్వాడీలు, వైద్య సిబ్బంది ఎవరూ ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. వివిధ రిజర్వాయర్లలో నీటి ప్రవాహ పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అధిక వర్షాలు కురిసినట్లయితే పరిస్థితిని బట్టి పాఠశాలలకు సెలవులు ప్రకటించాలన్నారు.

సజావుగా నీటి సంఘం ఎన్నికలు

జిల్లాలో నవంబర్ 23న నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు, 26న డిస్ట్రిబ్యూటరీ ఎన్నికలు, 28న ప్రాజెక్టు కమిటీల ఎన్నికలు సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

లక్ష్యాలు అధిగమించకపోతే చర్యలు

గృహనిర్మాణ శాఖకు సంబంధించి లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం వహించి వెనుకంజలో ఉన్న సాలూరు, పాలకొండ అర్బన్ ఏఈలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

డిసెంబర్ నాటికి పూర్తి చేయాలి

ఉపాధిహామీ పథకంలో రూ.349 కోట్లతో చేపట్టనున్న 549 పనులను డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల పురోగతిని ప్రతి 15రోజుల కోసారి అప్‌లోడ్ చేయాలని చెప్పారు. స్వర్ణాంధ్ర బుక్‌లెట్ ప్రతి ఒక్కరి దగ్గర ఉండాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ డి. కేశవ నాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఇరిగేషన్ ఈఈ ఆర్.అప్పలనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అవగాహన పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

వృద్ధులను ఇబ్బంది పెడితే శిక్షార్హులు

తల్లిదండ్రులు, వృద్ధులను ఇబ్బందులకు గురిచేసిన వారు శిక్షార్హులు అవతారని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ రూపొందించిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వయో వృద్ధుల సంరక్షణ, 60ఏళ్లు దాటిన తల్లిదండ్రులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత వారి కుమారులు, కుమార్తెలదేనన్నారు. వయో వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం చట్టం రూపొందించిందని జిల్లాస్థాయిలో కలెక్టర్, ఆర్డీఓ ఆధ్వర్యంలో ట్రిబునల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. తల్లిదండ్రుల ఆస్తిని పిల్లల పేరున రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు వారి పోషణను పిల్లలు పట్టించుకోకపోతే ఆస్తిని ఎప్పుడైనా తిరిగి తల్లిదండ్రుల పేరుమీద రిజిస్ట్రేషన్ చేయాలనే నిబంధన ఉందని స్పష్టం చేశారు. అలాగే వయో వృద్ధుల పోషణ, సంరక్షణ చూడకపోతే వయోవృద్ధుల సంరక్షణ చట్టం 2007 ప్రకారం కేసు నమోదు చేసి శిక్ష విధించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీఈఓ పగడాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యం వల్లే డయేరియా మరణాలు

- సకాలంలో వైద్యసేవలు అందక పెరుగుతున్న మృతులు
- తాజాగా మరిన్ని గ్రామాల్లో విస్తరించిన మహమ్మారి
- 25న జెడ్పీ అత్యవసర సమావేశం
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



జిల్లాలో డయేరియా కేసుల వివరాలను మీడియాకు వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: టీడీపీ కూటమి ప్రభుత్వ వైఫల్యంతోనే జిల్లాలో వరుసగా డయేరియా కారక మరణాలు సంభవిస్తున్నాయని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో డయేరియా మహమ్మారి పంజావిసరడంతో పదుల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయన్నారు. వ్యాధి నియంత్రణ చర్యల్లో ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం వైఫల్యం చెందిందని ఆరోపించారు. జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సకాలంలో వైద్యం అందక..

ఉమ్మడి విజయనగరం జిల్లాలో డయేరియా వ్యాధి వ్యాప్తిచెంది 20 రోజులు గడుస్తోంది. వ్యాధిని నియంత్రించడంలో విఫలమైన యంత్రాంగం బాధితులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించలేకపోతోంది. దీనవల్ల మరణాల సంఖ్య పెరుగుతోంది. డయేరియా మరిన్ని గ్రామాలకు విస్తరిస్తోంది. తాజాగా గుర్ల మండంలోని నాగళ్లవలస, గూడెం గ్రామాలకు సోకింది. గజపతినగరం మండలంలోని కెంగువ గ్రామంలో కేసులు నమోదవుతున్నాయి. వ్యాధిబారిన పడి సోమవారం మరో ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఆయా గ్రామాల్లో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి. లాక్‌డౌన్ పరిస్థితులు తలపిస్తున్నాయి. ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. నాగళ్లవలస గ్రామ సచివాలయంలో వ్యాధిగ్రస్తులే మంచాలు తెచ్చుకుని చికిత్స చేయించుకునే పరిస్థితి. ఎప్పుడు ఎవ్వరు చనిపోతారన్న భయం వెంటాడుతోంది. ఇటువంటి పరిస్థితులు జిల్లాలో నెలకొనడం దురదృష్టకరం.

ఆదుకోవాలి..

డయేరియా బారిన పడి మృతి చెందిన వారి కుటుంబాలతో పాటు బాధితులకు తగిన పరిహారం తక్షణమే ప్రభుత్వం అందజేయాలి. వైద్యసేవలకు ఆర్థిక కష్టాలను దూరం చేయాలి. డయేరియాపై రాజకీయం చేస్తున్నామని అధికారపార్టీ నేతలు విమర్శించడం సరికాదు. బాధ్యత గల ప్రతిపక్షంగా ఆపదవేళ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరుతున్నాం. జెడ్పీ చైర్మన్‌గా ప్రతిరోజు గ్రామాల్లో పర్యటించి రోగులు, ప్రజల యోగ క్షేమాలపై ఆరా తీస్తున్నా. ప్రభుత్వాన్ని, జిల్లా యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నాం.

25న జెడ్పీ సమావేశంలో కీలక తీర్మానాలు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో నెలకొన్న అనారోగ్య పరిస్థితులపై ఈనెల 25న నిర్వహించే జిల్లా పరిషత్ సమావేశంలో కీలక తీర్మానాలు చేయనున్నాం. సమావేశానికి ఉమ్మడి జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలకు ఆహ్వానం అందించాం. జిల్లాలో ప్రబలుతున్న విషజ్వరాలు, డయేరియా కారక మరణాలపై చర్చించి జిల్లాలో మెడికల్ ఎమర్జెన్సీ ఏర్పాటు చేయాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించే ప్రయత్నం చేస్తాం. రోగులకు మెరుగైన వైద్యసేవ లందేలా చూస్తాం. తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక ప్రణాళికలు అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం.

కొంప ముంచిన సమన్వయలోపం..

జిల్లాలో డయేరియా వ్యాప్తికి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల మధ్య సమన్వయ లోపమే కారణం. చివరికి డిప్యూటీ సీఎం పవన్ వచ్చి మృతి చెందిన 10 మందికి రూ.లక్ష చొప్పున తన సొంతడబ్బులు ఇస్తానని చెప్పారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ అంబేడ్కర్‌లు ఒక్కరే చనిపోయారంటూ ప్రకటనలు చేశారు. మృతులు వివిధ వ్యాధులతో బాధపడుతున్నా డయేరియా సోకడం వల్లే చనిపోయారు. మృతుల సంఖ్య లెక్కలపై సమగ్ర విచారణ చేయించాలి. అదే సందర్భంలో జిల్లా వ్యాప్తంగా మిగిలిన గ్రామ పంచాయతీల్లో సర్వే చేసి డయేరియా నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి.

ప్రభుత్వం స్పందించే వరకు ఒత్తిడి తెస్తాం..

డయేరియా నియంత్రణపై ప్రభుత్వం స్పందించి సరైన సదుపాయాలు కల్పించేంత వరకు బాధ్యత గల ప్రతిపక్షంగా ఒత్తిడి తీసుకువస్తాం. మొదటి నుంచి వైఎస్సార్‌సీపీ చెప్పిన తరువాతనే జిల్లా యంత్రాంగం నెమ్మదిగా స్పందిస్తూ వచ్చింది. స్కూల్‌లో బెంచీలపై వైద్యం అందించడం ప్రశ్నించిన తరువాతనే బెడ్‌లు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామంలో రోగులు తెచ్చుకునే మంచాలపై చికిత్స అందిస్తున్నారు. ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాల్సిన సమయం ఇది. గత ఐదేళ్లలో ఎన్నడూ ఇటువంటి ఘనటలు చోటు చేసుకోలేదు. సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన అవసరం ఉంది. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు వర్రి నర్సింహమూర్తి, ఇప్పిలి అనంత్, వలిరెడ్డి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

హంసవాహనంపై సిరులతల్లి

సిరులతల్లి పెద్దచెరువులో విహరించిన వేళ భక్తలోకం మురిసిపోయింది. హంస వాహనంపై జల ప్రదక్షణ చేస్తున్న చల్లని తల్లిని చూసి భక్తిభావం ఉప్పొంగింది. జై పైడిమాంబ.. జైజై పైడిమాంబ నామస్మరణ మారుమోగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు.. మేళ తాళాలు.. బాణసంచా వెలుగులు... భక్తుల భజనలతో పెద్దచెరువు గట్టు కాస్త ఆధ్యాత్మిక క్షేత్రాన్ని తలపించింది. కోట సత్తెమ్మ తల్లి సాక్షిగా సాగిన తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తజనం తరలివచ్చింది. అమ్మవారి ఆశీస్సులు అందుకుని పరవశించిపోయింది. చల్లని తల్లి కరుణ తమ కుటుంబంపై ఎల్లవేళలా ఉండాలంటూ ప్రార్థించింది.



పుష్పాలంకరణలో పైడితల్లి



వనంగుడిలో పైడితల్లి అమ్మవారు



పెద్ద చెరువులో పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవం

- పెద్దచెరువులో వైభవంగా సాగిన పైడితల్లి తెప్పోత్సవం
- వేదమంత్రాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు
- ప్రత్యేక పల్లకిలో తిరువీధి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవం మంగళవారం సాయంత్రం విజయనగరంలోని పెద్ద చెరువులో కనులవిందుగా సాగింది. ఈ సుందర దృశ్యాన్ని తిలకించేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ముందుగా వనంగుడిలోని అమ్మవారి ఉత్సవ విగ్రహానికి వేదపండితుల మంత్రోచ్ఛరణాల నడుమ పంచామృతాభిషేకాలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ జరిపారు. అనంతరం పల్లకిలో ఉంచి సున్నంబట్టీ వీధి మీదుగా భక్తుల భజనల నడుమ పెద్దచెరువు వద్దకు తీసుకొచ్చారు. సాయంత్రం 5.30 గంటల సమయంలో అక్కడ ఉన్న హంసవాహనంపై అమ్మవారిని ఆశీనులు చేసి తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. ఎన్‌సీఎస్ రోడ్డు, రామానాయుడు రోడ్డు, కోటసత్తెమ్మ తల్లి, నూకాలమ్మ అమ్మవారి ఆలయం వరకూ భక్తులు తిలకించేలా హంసవాహనంపై అమ్మవారి జలప్రదక్షణ మూడుసార్లు సాగింది. పెద్దచెరువులో పైడితల్లి జలవిహారం చేస్తున్నంత సమయం భక్తులు బాణాసంచా కాల్చి పండగ చేసుకున్నారు. అమ్మవారిని చూసి తన్మయత్వం చెందారు. హంసవాహనాన్ని గత 23 ఏళ్లుగా సిద్ధం చేస్తున్న సుగంధపు రాంబాబు ఆచారి ఈ ఏడాది కూడా భక్తుల మన్ననలు పొందారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఫిషరీస్, మున్సిపల్, ఫైర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వనంగుడిలో ఉత్సవ విగ్రహానికి జలాభిషేకం చేస్తున్న ఆలయ సిబ్బంది, వేద పండితులు

వేదపండితులకు ఘన సత్కారం

తెప్పోత్సవ సమయంలో అమ్మవారికి వేదమంత్రోచ్ఛరణాలతో వేదస్వస్తి నిర్వహించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. వనంగుడిలో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు నిర్వహించిన వేదస్వస్తిలో సుమారు 25 మంది వేదపండితులు పాల్గొన్నారు. డాక్టర్ ఎ.గోపాలరావు, డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవిలు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈఓ ప్రసాదరావు వేదపండితులు, అతిథులను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.

పుష్పాలంకరణలో అమ్మవారు

జాతరలో భాగంగా వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మూడులాంతర్లు వద్ద ఉన్న చదురుగుడి, రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వనంగుడిలో అమ్మర్లను పుష్పాలతో అలంకరించారు. తెప్పోత్సవం వేళ అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు.

ఉత్సవానికి కొరవడిన అధికార, ప్రజాప్రతినిధులు

పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవానికి జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడం అందరినీ విస్మయానికి గురిచేసింది. కేవలం ఈఓ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు ఉత్సవాన్ని ముందుండి నడిపించారు. ఏటా కనీసం ఐదారుగురు జిల్లా స్థాయి అధికారులు ఉత్సవంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులందుకునేవారు. ఈ ఏడాది ఆ ఆనవాయితీ కొనసాగలేదు. పోలీసుల అత్యుత్సాహంతో తెప్పోత్సవం వేళ ఇబ్బందులు తప్పలేదని పలువురు భక్తులు వాపోయారు. రోప్‌ల ఏర్పాటుతో సున్నంబట్టీ వీధి వాసులు తెప్పోత్సవానికి రాలేకపోయారు. కొందరు భక్తులు ఎన్‌సీఎస్ రోడ్డులో చెరువు వైపు వెళ్లి అక్కడ నుంచి అమ్మవారిని దర్శించుకున్నారు.



హంసవాహనంపై అమ్మవారిని ఆశీనులు చేస్తున్న వేదపండితులు



తెప్పోత్సవం వద్ద బారులు తీరిన భక్తులు



తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

క్లుప్తంగా

మహాసభలను విజయవంతం చేయండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ



మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: విజయనగరం పట్టణంలో నవంబర్ 16,17 తేదీల్లో జరగనున్న సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, ప్రజలకు ఏవిధంగా ఉపయోగపడ్డాయి? వాటి ఫలితాలు, సీపీఎం చేసిన కృషిని మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. రెండురోజుల పాటు మహాసభలు నిర్వహిస్తారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు రెడ్డి శంకర్రావు, టీవీ రమణ, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర కబడ్డీ టోర్నమెంట్‌లో పతకాలు



అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు

విజయనగరం అర్బన్: ఇటీవల స్థానికంగా శ్రీ పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా జరిగిన ఉత్తరాంధ్ర ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్‌లో సత్య డిగ్రీ విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకుడు డాక్టర్ ఎం.శశిభూషణ రావు విద్యార్థులను అభినందిస్తూ, నేటి యువత విద్యతో పాటు క్రీడలను కూడా స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. బాలికలు బాలలకు దీటుగా నిలుస్తూ తమదైన శైలిలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఎం.సత్యవేణి, లెఫ్టినెంట్ ఉదయ్ కిరణ్, ఎన్ఎస్ ఎస్ ఆఫీసర్ బి.సూరప్పు నాయుడు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ హెచ్‌హెచ్ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయితో నిందితుడి అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితుడితో ఎస్సై దుర్గాప్రసాద్ తదితరులు

పూసపాటిరేగ: మండలంలో శుక్రవారం జరిగే సంత సమీపంలో గంజాయితో ఓ నిందితుడు పట్టుబడినట్లు ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ మంగళవారం తెలియజేశారు. కందివలస గ్రామానికి చెందిన దేశెట్టి భానోజీ నుంచి 1200 గ్రాముల గంజాయితో పట్టుబడడంతో సరుకు స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాలలో పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఇంటర్మీడియట్ అర్హత గల అభ్యర్థులు రూ.100 రుసుముతో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల29వతేదీ సాయంత్రం 5 గంటల లోగా ఆఫీసు పనిదినాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలలో అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం విజయనగరం. ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలు లేని దరఖాస్తులు తిరస్కరించనున్నట్లు స్పష్టం చేశారు. పోస్టు ద్వారా వచ్చే దరఖాస్తులు 29వతేదీ సాయంత్రం 5 గంటలు లోగా రావాలని, పారామెడికల్ కోర్సుల కౌన్సెలింగ్ ప్రభుత్వ వైద్య కళాశాలలో నవంబర్ 4వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. పారామెడికల్ కోర్సులకు ఇంటర్మీడియట్ విద్యార్హత కల్గిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ఇంటర్మీడియట్‌లో బైపీసీ చదివిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. తదుపరి ఎంపీసీ చదివిన విద్యార్థుకు, ఆఖరి ప్రాధాన్యం ఇతర గ్రూప్‌ల వారికి ఇవ్వనున్నట్లు తెలియజేశారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹137	₹244	₹254

మద్దతు ధరకు 'తేమతెగులు'

- ఏటా కోత వేస్తున్న మిల్లర్లు
- కీలక దశలో వరుస వర్షాలు.. నష్టపోతున్న రైతన్న
- 1,75,485 ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్ వరిసాగు
- 3,57,921 మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని అంచనా
- 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కసరత్తు...



చింతాడ వద్ద తేలిక రకం వరి పంటను యంత్ర సహాయంతో కోత కోస్తున్న దృశ్యం

పాలకొండ రూరల్: ఖరీఫ్ సేద్యం దాదాపుగా చివరి దశకు చేరింది. తేలిక రకాల నుంచి దిగుబడి చేతికి వస్తున్న క్రమంలో రైతులు ఆరుగాలం సాగించిన కష్టాన్ని సొమ్ము చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు ధాన్యం కొనుగోలుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఏటా ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతుల నుంచి తలెత్తుతున్న అనుమానాలకు మాత్రం అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం దక్కని పరిస్థితి నెలకొంటోంది. రైతులకు క్షేత్రస్థాయిలో సేవలు అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో 306 ఆర్‌బీకేలు ఏర్పాటు చేసింది. ఇక్కడి సిబ్బంది అనుక్షణం రైతుకు అండగా ఉండేవారు. ఈ కేంద్రాల ద్వారా దాదాపు ఏటా రూ.107.19 కోట్ల మేరకు 'రైతు భరోసా' పేరిట నాలుగు నియోజకవర్గాల్లో సేద్యం చేపట్టిన 1,42,930 మంది, మరో 9,256మంది కౌలు రైతుల బ్యాంక్ ఖాతాలకు నిధులు జమ అయ్యేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి కనబడడం లేదు. ఈ–క్రాప్ నమోదులో తీవ్ర జాప్యం జరిగింది. ఉచిత పంటల బీమా ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వం గ్రేడ్–1 రకం వరి క్వింటాకు మద్దతు ధర రూ.2,320, సాధారణ రకం క్వింటాకు మద్దతు ధర రూ.2,300 అందిస్తామని తాజాగా పేర్కొంది. ఈ క్రమంలో నిర్దేశిత మద్దతు ధర రైతుకు అందించాలంటే తేమశాతం కీలకమంటూ మిల్లర్లు మాయ చేయడం పరిపాటిగా మారింది. గ్రామస్థాయిలో రైతుసేవా (ఆర్‌బీకే) కేంద్రాలకు చెందిన అధికారులు ముందే నిర్ధారించిన తేమ శాతాన్ని పట్టించుకోకుండా మిల్లర్లు ఇష్టానుసారం తేమశాతం నిర్ధారించి మద్దతు ధరలో కోత పెడుతున్నారు. ఈ తీరును రైతులు మరిచిపోలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వంలో ధాన్యంలో తేమశాతం నిర్ధారణపై ఏవిధంగా ముందుకు సాగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రైతుసేవా కేంద్రాల అధికారులు నిర్ధారించిన తేమశాతం అంతిమమా..? లేక మిల్లర్లు నిర్ధారించిన తేమశాతాన్ని పరిగణనలోకి తీసుకుంటారా? అనే విషయంలో అధికారులు స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లాలో దాదాపు 1,75,485 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. ఈ సేద్యం ప్రాప్తికి 15 మండలాల పరిధిలో 3,57,921 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ సూచనలతో జిల్లా పరిధిలో రైతులు పండించిన పంటలో 2.70 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన కసరత్తు ప్రారంభించిన అధికారులు 183 కేంద్రాల ద్వారా కొనుగోలు చేయదలిచారు. 93 మిల్లులను ఇందుకోసం గుర్తించారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు ఎన్నో



పాలకొండలో కోతలు పూర్తి చేసిన వరి దిగుబడిని బస్తాలకు ఎత్తుతున్న రైతులు

ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని పంట సాగు చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం అందక పోవడంతో అప్పులు చేసి మదుపులు పెట్టారు. భారీ వర్షాలకు నాట్లు, నారుమడులు దెబ్బతినడంతో అదనపు పెట్టుబడులు పెట్టాల్సి వచ్చింది. తాజాగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశాలు ఉన్నట్లు తెలుసుకుని ఆందోళన చెందుతున్నారు.

మిల్లర్ల మాయాజాలం సహించం



అన్నదాత కష్టం దోచుకోవాలని మిల్లర్లు భావిస్తే సహించం. రైతుసేవా కేంద్రాల సిబ్బంది నిర్ధారించిన తేమశాతం ప్రకారమే ధాన్యం తీసుకోవాలి. ధాన్యం కొనుగోలులో తేమశాతం పేరుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు నిర్ధారించిన తేమశాతాన్ని మిల్లర్లు పరిగణనలోకి తీసుకోవడం లేదు. రైతులకు అందించాల్సిన మద్దతు ధరలో కోత పెడుతున్నారు. మిల్లర్ల మాయాజాలంతో రైతు నష్టపోకుండా స్పష్టమైన విధివిధానాలను అధికారులు ఖరారు చేయాలి. ఇప్పటికే రైతులు అధిక మదుపులు పెట్టి ఇబ్బందులు పడుతున్నారు. **బుడితి అప్పలనాయుడు, ఏపీ రైతు సఘం జిల్లా ప్రధాన కార్యదర్శి**

విద్యా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు
- ముగిసిన ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రథమ మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు

పార్వతీపురంటౌన్: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో మంగళవారం జరిగిన ఏఐఎస్ఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమ మహాసభల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటం చేస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. భవిష్యత్ పోరాటాలకు విద్యార్థులను ఏకం చేసి పోరాటాలు నిర్వహించాలని కోరారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటాలకు శ్రీకారం చుడతామని, విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా ఏఐఎస్ఎఫ్ తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో జరగబోయే పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

నూతన జిల్లా సమితి ఎన్నిక

ఏఐఎస్ఎఫ్ జిలాల్ సమితి అధ్యక్ష కార్యదర్శులుగా ఎం.భీమరాజ్ బి.రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారితో పాటు 17 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణ్, సీపీఐ జిల్లా కార్యదర్శి మన్మథరావు, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ఏఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు గోపినాయుడు, బీటీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యుత్ ఉద్యోగుల సత్తా

- క్రీడాకారులను అభినందించిన ఎస్ఈ లక్ష్మణరావు



బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలను అభినందిస్తున్న ఎస్ఈ లక్ష్మణరావు

విజయనగరం: షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజయనగరం ఏపీఈపీడీసీఎల్ అపరేషన్ సర్కిల్ నుంచి ప్రాతినిధ్యం వహించిన విద్యుత్ ఉద్యోగులు సత్తా చాటారు. ఇటీవల నెల్లూరు జిల్లాలో జరిగిన ఇంటర్ సర్కిల్ టోర్నమెంట్‌లో విజయనగరం నుంచి ప్రాతినిధ్యం వహించిన పి.పైడిరాజు, గిరి, బి.సింహాచలం, వై.ఓంకార్, బి.లోకేష్‌ల బృందం ద్వితీయస్థానం దక్కించుకుంది. ఈ మేరకు మంగళవారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులను ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ పి.త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి వి.రాంబాబులు అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఈ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉద్యోగులు క్రీడల్లో రాణించడం ద్వారా ఒత్తిడి తగ్గి ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చని హితవు పలికారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి ఏపీఈపీడీసీఈఎల్ విజయనగరం ఆపరేషన్ సర్కిల్‌కు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

వలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న వలంటీర్లు, ఏఐటీయూసీ నాయకులు

పార్వతీపురం టౌన్: తక్షణమే వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్ వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వలంటీర్లతో కలిసి మంగళవారం పార్వతీపురం పట్టణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల ప్రజలకు సేవలు అందించిన నిరుద్యోగ యువతీ యువకులను కూటమి ప్రభుత్వం రోడ్డున పడేయడం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. గతంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తూ ఉద్యోగాన్ని కొనసాగిస్తామని వారిలో ఆశలు కలిగించారని, ఇప్పటికి ఐదు మాసాలు గడిచి సుమారు 17 క్యాబినెట్ సమావేశాలు నిర్వహించినా ఒక సమావేశంలో కూడా వలంటీర్ల ప్రస్తావన జరగలేదన్నారు. వలంటీర్లకు బకాయి ఉన్న ఐదు నెలల గౌరవ వేతనాన్ని చెల్లించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కరోనా లాంటి కష్ట పరిస్థితుల్లో సేవలందించిన వలంటీర్లపై మానవతా దక్పథంతో ఆలోచించి వారిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. వలంటీర్లకు మళ్లీ ఉద్యోగం ఇచ్చేంతవరకు నిరసన తెలుపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే అవగాహన అవసరం

- ఏపీఎస్పీ కమాండెంట్ మల్లికా గార్గ్



విద్యార్థులు తిలకిస్తున్న పోలీస్ హౌస్‌ను పరిశీలిస్తున్న బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్

డెంకాడ: సమాజంలోని వివిధ అంశాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవడం ద్వారా భవిష్యత్‌లో మంచి ప్రయోజనం ఉంటుందని చింతలవలస ఐదవ ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని బెటాలియన్‌లోని యూనియన్ ఫంక్షన్ హాల్ ఆవరణలో మంగళవారం పోలీస్ హౌస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రదర్శించిన ఆయుధాల పనితీరును విద్యార్థులకు ఆమె వివరించారు. ఈ సందర్భంగా ఎస్‌డీఆర్ఎఫ్ డిమాన్‌స్ట్రేషన్‌ను విద్యార్థులు తిలకించారు. బెటాలియన్‌లో ఉన్న పాఠశాలతో పాటు వివిధ పాఠశాలల నుంచి వచ్చిన వందలాది మంది విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కమాండెంట్ మల్లికా గార్గ్ మాట్లాడుతూ పోలీస్ ఆయుధాల పనితీరు, ఇతరఅంశాలపై విద్యార్థులు తెలుసుకోవడం ద్వారా అవగాహన పెంచుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో 1వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ పి.సత్తిబాబు, బెటాలియన్ ఇన్‌చార్జ్ అడిషనల్ కమాండెంట్ జీవీ ప్రభాకరరావు,అసిస్టెంట్ కమాండెంట్‌లు ఎస్.బాపూజీ, ఆర్ఐలు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

28న విద్యార్థులకు వ్యాసరచన, వ్యకృత్వ పోటీలు

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 28న సోమవారం ఉదయం 9.30 గంటలకు గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వం పోటీలను నిర్వహిస్తున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి నుంచి పదోతరగతి వరకూ వకృత్వ పోటీలో గురజాడ కన్యాశుల్కం, నాటి సామాజిక పరిస్థితులు అనే అంశంపై గంట నిడివిలో మాట్లాడాల్సి ఉంటుందన్నారు. గురజాడ దేశభక్తి అంశంపై 6,7 తరగతి విద్యార్థులకు, 8,9,10 తరగతి విద్యార్థులకు గురజాడ సాహిత్యంలో మహిళ అనే అంశంపై వ్యాసరచన నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విజేతలకు నవంబర్ 30న సాయంత్రం గురజాడ విశిష్ట పురస్కార ప్రదానోత్సవ సభలో బహుమతి ప్రదానం చేయనున్నట్లు స్పష్టం చేశారు. వివరాలకు ఫోన్ 9912764646, 8374449526, 9440117116 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లితీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో చింతపల్లిబీచ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఒడ్డుకు కొట్టుకుని వచ్చిందని సమాచారం అందడంతో వెళ్లి పరిశీలించిన పోలీసులు మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉండవచ్చని తెలియజేశారు. మృతుడి వివరాలు తెలిసినవారు పూసపాటిరేగ ఎస్సై ఫోన్ 9121109447 నంబర్‌కు తెలియచేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..



ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి

పూసపాటిరేగ (భోగాపురం): భోగాపురం మండలం సుందరపేట ఫ్లైఓవర్ వద్ద జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతిచెందాడు. విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు పల్సర్‌బైక్‌పై వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి డివైడర్‌ను బలంగా ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు భోగాపురం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

చిన్నయ్యపేట గ్రామస్తులతో ఫ్యాక్టరీ యాజమాన్యం చర్చలు




చిన్నయ్యపేట గ్రామస్తులతో చర్చిస్తున్న ఫ్యాక్టరీ యాజమాన్య ప్రతినిధులు


రేగిడి: మండలంలోని చిన్నయ్యపేట గ్రామస్తులతో సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం యాజమాన్యం చర్చలు జరిపింది. ఈ ఫ్యాక్టరీ వల్ల తమ గ్రామం మొత్తం నష్టపోతుందని గ్రామస్తులు ఈనెల 21 న ఫ్యాక్టరీ ఎదుట ధర్నాచేశారు. ఈమేరకు స్పందించిన ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రతినిధులు అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభిరావిఎరెడ్డి, కేన్ డీజీఎం రమేష్ తదితరులు చిన్నయ్యపేట గ్రామానికి మంగళవారం చేరుకుని, పెద్దలతో పాటు యువతను కూర్చోబెట్టి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామానికి తాగునీటి వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేస్తామని, ప్రతి నెలా వైద్య శిబిరం నిర్వహించి, ఉచితంగా మందులు ఇస్తామని, సాగునీటి చెరువులకు ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. వారం రోజుల్లో వాటిని ప్రారంభిస్తామన్నారు. ఇదిలా ఉండగా తమ గ్రామంలోకి ఫ్యాక్టరీ కాలుష్యం రాకుండా చూడాలని గ్రామస్తులు కోరారు.

వసతిగృహాల్లో సమస్యల తిష్ఠ

- ఒక్కో గదిలో 20మంది విద్యార్థులు
- మరుగుదొడ్లు, భోజనాల షెడ్లు లేని పరిస్థితి
- విద్యార్థుల అవస్థలు పట్టించుకోని అధికారులు



గిరిజన సంక్షేమ వసతి గృహం పార్వతీపురం



పారిశుధ్యం లేని మరుగుదొడ్లు

పార్వతీపురంటౌన్: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు సమస్యలతో సతమవుతున్నారు. తాగడానికి, వినియోగానికి నీరు, ఉండడానికి సరిపడ గదులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్స్‌లో విద్యార్థులకు సరిపడా గదులు, మరుగుదొడ్లు లేవు. ఒక్కో గదిలో దాదాపు 15 నుంచి 20 మంది వరకూ ఉండాల్సిన దుస్థితి నెలకొంది. కొంతమంది గదుల్లో ఉంటే మరి కొంతమంది విద్యార్థులు బయట ఉండాల్సి వస్తోంది. జిల్లాలో సాంఘిక సంక్షేమ, బీసీ, గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాలు మొత్తం 450 ఉన్నాయి. వాటిలో 25,410 మంది విద్యార్థులు ఉన్నారు. కొన్ని వసతి గృహాల్లో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకోవడానికి బయటకు పరిగెత్తాల్సిన పరిస్థితి దాపురించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వసతి గృహాల్లో సమస్యలు వెక్కిరిస్తున్నాయి. హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్షంగా వ్యవహరిస్తోంది.

గత ప్రభుత్వంలో మౌలిక సదుపాయాలకు పెద్దపీట

గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేశారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే వసతి గృహాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించారు. దీంతో వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల చదువులు సాఫీగా సాగాయి.

అద్దె చెల్లిస్తున్నా వసతులు శూన్యం

జిల్లాలోని కొన్ని వసతి గృహాలకు ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో ప్రైవేట్ బిల్డింగ్‌లు అద్దెకు తీసుకున్నారు. ఒక్కోవసతి గృహానికి నెలకు రూ.40వేల నుంచి రూ.50 వేలు ప్రభుత్వం అద్దె చెల్లిస్తున్నప్పటికీ సరైన వసతులు మాత్రం లేవు. గదులకు తలుపులు, కిటికీలు కూడా లేవు. దోమల బెడదతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు అయితే జాగారం చేయాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థులు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి ప్రతి నెలా అద్దె చెల్లిస్తున్నప్పటికీ భవన యజమానితో మరమ్మతులు చేయించాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉంది. అయితే వార్డెన్లు ఇవేమీ పట్టించుకోవడం లేదు.

పర్యవేక్షణ శూన్యం

వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు విద్యార్థులకు మోనూ ప్రకారం భోజనం అందేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖల డైరెక్టర్, సహాయ సంక్షేమ అధికారులపై ఉంది. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కొన్ని వసతి గృహాల్లో సిబ్బంది కొరత

150 మంది విద్యార్థులు ఉన్న వసతి గృహంలో 3 నుంచి 4 మంది వర్కర్లు పని చేయాల్సి ఉంది. అయితే జిల్లాలోని కొన్ని వసతి గృహాల్లో ఒక్క వర్కర్‌తో మాత్రమే అన్ని పనులు చేయిస్తున్నారు. వర్కర్ ఒక్కరే ఉండడంతో విద్యార్థులు భోజనం కూడా సరిగా చేయలేని పరిస్థితి నెలకొంది. ఉడికీ ఉడకని అన్నం, కూరలు పెడుతుండడంతో విద్యార్థులు భోజనం తినలేక బయట పడేస్తున్నారు. వర్కర్ ఒక్కరే అన్ని పనులు చేయలేకపోతుండడంతో విద్యార్థులతో వంటపనితో పాటు ఇతర పనులు చేయిస్తున్నారు.



విద్యార్థులు పారబోసిన ఆహారాన్ని తింటున్న వీధి కుక్కలు



వసతి లేని వసతి గృహగదులు

సౌకర్యాలు కల్పించాలి



వసతిగృహాల్లో సౌకర్యాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని వసతిగృహాల్లో మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడం, మరికొన్ని వసతిగృహాల్లో భోజన సౌకర్యం సరిగ్గా లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. ఒక్కో గదిలో 20మందికి పైగా విద్యార్థులు ఉంటున్నారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి వసతిగృహాలకు మరమ్మతులు చేపట్టాలి.

– పి.రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయకార్యదర్శి, పార్వతీపురం

దురలవాట్లకు దూరంగా ఉండండి

రాజాం సిటీ: దురలవాట్లకు దూరంగా ఉండాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. స్థానిక ఎస్ఎల్‌టీఎస్ డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై మంగళవారం అవగాహన కల్పించారు. చెడు వ్యసనాల బారినపడి ఎంతోమంది తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు.